

# పగిలిన సంకెలు

యస్. కాశీవిశ్వనాథం
&
విజయా రఘురాం

పైడియ్య ఆకాశం వంక చూసాడు.

వారం రోజులుగా ఏడ్చి ఏడ్చి అలసిపోయిన ఆకాశం అప్పుడే కళ్ళు తుడుచుకుంటోంది.

పైడియ్య నేలవంక చూసాడు.

వర్షానికి తడిసి ముద్దయిపోయిన తడి చీర విప్పేసి అప్పుడే పొడి చీర కట్టుకుంటోంది భూమాత.

పైడియ్య ఎదురుగా వున్న ట్రావెలర్స్ బంగళావైపు చూసాడు అది వర్షంలో తడిసిపోయినప్పటికి, దేవశల నందర్శి కూలికి పిల్చి ధనవంతులు కట్టించుకున్న బంగళాలా అందంగా కనబడుతోంది. పైడియ్య తన కెదురుగా వున్న పొలంవాటి రోడ్డువైపు చూసాడు. ఇరు ప్రక్కల పచ్చగా ఎత్తుగా పెరిగి, మత్తుగా వూగుతున్న పంటచేల మధ్య తిన్నగా సాగిన సన్నటి రోడ్డు పాపిడి తీసుకున్న తల పాపిడిలా అందంగా వుంది.

వాతావరణం చల్లగా వుంది, ఇంకెంతో ఆహ్లాదంగా వుంది. కాని, పైడియ్య మనసు మాత్రం చల్లగా లేదు. ఆనందంగా లేదు

అందుకు కారణం అతని ఒంట్లో అయిదురోజులుగా కాపురముంటున్న జ్వరం కారణం కావచ్చు. లేదా అయిదు రోజులుగా సరిఅయిన తిండిలేక అతని కడుపులోని పేగులు పాడుకుంటున్న అతని పాట కావచ్చు లేదా, ఈ రెండూ కూడా కారణం కావచ్చును.

"ఇయ్యాలకూడా ఎవరూ రానట్టే" అని లోలోనే సణుక్కున్నాడు. కాని ఆ మాటలు పెదవులు దాటి పైకొచ్చాయి. అతనేం మాట్లాడుతున్నాడో విందామని కాబోలు ఓ చల్లని గాలి తెమ్మెర అతని దగ్గరకొచ్చింది. దాంతో పైడియ్య ఒళ్లు రివ్వరివ్వలాడింది. కప్పుకున్న గోనుగుల దుప్పటిని మరింత గట్టిగా అదుము కున్నాడు. తర్వాత తను కప్పుకున్న దుప్పటిని పరిశీలించి చూసాడు. అది నల్లని మేకతోలులాగ ఒద్దొల్లగావుంది. అంతేకాక, మురిగిపోయిన తోలులాగ దుర్వాసనకూడా వేస్తున్నట్టనిపించింది.

ఆ తర్వాత తన ఎడమ చేయి పిడికిలి విప్పి చూసాడు. నల్లగా, అసహ్యంగా వున్న అరచేతిలో తెల్లగా, అందంగా వెండిపువ్వుల్లా మెరుస్తున్నాయి పైసలు తొమ్మిది.

అవును, అవి తొమ్మిది పైసలు.

ఈ తొమ్మిది పైసలకి ఏడు బీడీ లొస్తాయి. లేకపోతే రెండు కొబ్బరి ఉండలొస్తాయి, కానీ పావు కేజీ బియ్యం మాత్రం రావు. కడుపులోని ఆకలి తీరదు, తీరదు. చేతిలో ఇంతకంటే నయాపైసా ఎక్కువలేదు. 'ఛీ ఛీ ఎదవబతుకు' అని మనసులోనే ఘోరంగా మూలుక్కుని భారంగా తన గుడిసెవైపు నడిచాడు.

ఆ గుడిసె ఒరిగిపోయిన గూడు బండిలా ఓ ప్రక్కకి వాలిపోయింది అది తడిసిపోయి ఉండటంచేత ఏట్లో కొట్టుకొచ్చిన గూడుబండిలా తడితడిగావుంది గుడిసెలోకి దూరి చూసాడు. గుడిసెనిండా చల్లటి చీకటివుంది చీకటి మధ్య నల్లగా వున్న నులకమంచం మీద తెల్లగావున్న మనవడు కనకారావు మూడంకె వేసుకుని నిద్రపోతున్నాడు. ఆసమయంలో పన్నెండు సంవత్సరాలు నిండి, తిండిలేక పడివున్న మనవణ్ణి ప్రేమగా ముద్దు పెట్టుకోవాలనిపించలేదు. చాచి తన్నుదామనిపించింది.

"ఈ జెష్టనంజికొడు కొకడు తల్లిని, తండ్రిని తినేసి పుట్టిన గుంటనా కొడుకుని పెంచి పెద్దజేసానా యీడికి ఒంట్లో ఏమాయినా యిసొంత్రంవుందా? నేదు. ఉయ్యో! మా తాత జ్వరంతో వారం రోజుల్నుంచి సస్తన్నాడు. ఆకల్తో కడుపు నెప్పొచ్చి గింజుకుంటున్నాడు. నెలాకరు రోజులంయి, జీతం యింకా సేతికిరాక పెద్ద యిబ్బంది పడిపోతున్నాడు. అని కొంచెమయినా ఆలోసించి, ఎక్కడయినా కాసి డబ్బు దొరికే ఆదరవు సూసెనా? నేనే…"

పైడియ్య మాటల్ని దగ్గు తినేసింది. నివురు కమ్ముకుంటున్న నిప్పుల్ని వేళ్లతో

ఆటూ ఇటూ కదిపి కుంపటిన్ని తనకు దగ్గరగా లాక్కున్నాడు.

నిద్రపోతున్నాడనుకున్న మనవడు కనకారావు నిద్రపోవడంలేదు. పైడియ్య తాత మాటల్ని వినగానే పాములాగ బుస కొట్టేడు.

“తాతా నీ యిష్టమొచ్చినట్టు మాటాడక. వారంరోజుల్నుంచి వర్షం ఒదిత్తే కదా పైకెళ్ళి పైసల్ట్రాటాడానికి”—అంటూ ఇంట్లో దోసెడు బియ్యంగాని, చేతిలో చిటికెడు చిల్లరగాని లేకపోవడానికి కారణం కురిసిన వానదే తప్ప నిద్రపోతున్న తనదికాదని వాదించాడు కనకారావు.

“సరిసర్లే. ఇయ్యాల వాన తెరిపిచ్చింది గదా మరెక్కడొట్టుకొస్తావో నాకు తెల్దుగాని నువ్వు మాత్రం ఆ సింతలూరి డాట్రకాడ కెల్లిమందు లొట్రావాల ఆ తరువాత కోవిటోడి కొట్టు కెల్లి బియ్యం వోట్రావాల.’

“ఈ మాయదారి దగ్గు గుండెకాయల్ని కైమాకింద కొట్టేత్తన్నాది. దీనికొకటే మందున్నది. సాంబయ్యగాడి కొట్టుకెళ్ళి సారాసుక్క ఏసుకుంటేగాని యీదగ్గుకి బుద్దిరాదు పాత బాకీ కక్కించే సాగా గలా యికూడా వోసన సూపించనంటన్నాడా దొంగనాకొడుకు....యీటన్నిటికీ డబ్బులు కావాలి....” పైడియ్య ఆయాసంతో ఆగిపోయాడు. ఆగిపోయి దగ్గాను దగ్గిదగ్గి దమ్ముకొల్పోయి, అలిసిపోయాడు. కనకారావుకి తాత చెప్పిన మాటలు చేదుగా




వినిపించి బాధగా అనిపించాయి.

‘డబ్బులొట్రా ఒట్రా అంటే ఎవుడి జేబులన్నా కన్నంవేసి వొట్రావాలగాని మరోదోవ కనబడ్డంలేదు. బంగలాలోకి ఎళ్ళలయినా దొరబాబులు రావాలి పార్టీలు చేసుకోవాల అప్పుడు కదా మనకి కనిసిన్ని డబ్బులు రాలేవి. నెల్లోని మొదటి రెండు వారాలు గవుర్మెంటిచ్చిన జీతం సివారి రెండు వారాలు దొరబాబు లిచ్చిన ‘కస్పి’ డబ్బులు సరిపోతాయి. అయినా గవుర్మెంటు ఇచ్చే జీతం ఈ కంత. చేయించుకునే పని కొండంత. బంగాల్లో కొచ్చి దొరబాబులేగాని మనకి కాణీ పరక ఇవ్వకపోతే మనమేం అడుక్కు తింటమే....’

పన్నెండేళ్ల కనకారావు పాతికేళ్ళ మూలుగుమూలిగాడు. తర్వాత వారం రోజులు నీరసబద్ధకంతో వొళ్ళు విరుచుకున్నాడు. కళ్ళువిప్పుకుని బయటకు చూశాడు. చూసిన కళ్ళు చూసినట్టే వుండి పోయాడు. అలా వుండిపోయిన కళ్ళల్లో అదో కేళీ ఆనందం మెరిసింది.

"ఒరే తాతా కారొస్తున్నాదిరా"—అంటూ గట్టిగా అరిచాడు. పైడియ్య ఉలిక్కిపడి చూశాడు. భూదేవి తల పాపిట మీదుగా, చీకటి సిల్కు తెరల్ని చీల్చుకుంటూ ఏదో వింతపురుగు రెక్కలు చాచి ఎగురుకుంటూ వస్తున్నట్టు. ఓ కారు వస్తోంది అత్తోటంట ఏకారువచ్చినా అది బంగళాలోకి దిగడానికి వచ్చినవారిదే అయి వుంటుంది.

పొద్దుటాలొస్తే గెస్టు హౌస్ తాళాలు పడతాయి. రాత్రి సీసాల మూతలు ఎగురుతాయి. కొండొకచో పువ్వులు నలుగుతాయి. నవ్వులు బ్రతుకుతాయి. ఆ మర్నాడు చేతిలో చిల్లర డబ్బులు రాలుతాయి, ఆ తర్వాత పైడయ్య కడుపులోకి సారా చుక్కలు చేరతాయి. అది గవర్నమెంటు వాళ్ళ అధీనంలో వున్న బంగళా. దాన్ని వాడుకోవడానికి పర్మిషన్ పొందిన పెద్దలు అక్కడ బసచేసి అక్కడ వాచ్‌మెన్‌గా వుండే పైడయ్య సేవలు అందుకుంటారు. తర్వాత వెళ్ళిపోయేటప్పుడు పైడియ్య శక్తి పురస్సరంగా చేయి చాపితే, వాళ్ళు ప్రేమపూర్వకంగా ఫలం, పుష్పం తోయం ఇస్తారు. అంటే ఒకటో, రెండో, మూడో ఇస్తారు, అయితే వారం రోజులుగా దిక్కుమాలిన దరిద్రపు వాన (నెలాఖరప్పుడు వర్షం కురిస్తే దాన్ని పైడియ్య ఇంతకంటే ఘోరంగానే తిడతాడు) కురియడం వలన బంగళా తలుపులకి, పైడియ్య బొడ్డుకొని తాళాలకి పొత్తు కలియలేదు.

"ఒరే కనకారావ్, ఆ కారులో వస్తున్న బాబులు మన బంగళాకే వస్తున్నారుగాని యీ తాళాలొట్టుకెళ్లి బంగళా ఓపెన్ సెయ్యి. నే నియ్యాల రాత్రంతా అక్కడ కాపలా కాయలేను, నా ముడుకులు సలసెత్తన్నాయి. సల్లగాలి తగిలితే వొళ్ళు జివ జివ లాడేస్తాది. అంచేత యియ్యాల్టికి నువ్వెల్లు. మీ తాతేడ్రా అని అడిగితే సలి జొరంతో పాకలో తొంగున్నాడని సెప్పు ఆ బాబుల కాడ బాగా మసులుకో అల్లకి కావల్సినవన్నీ తెచ్చిపెడితే, ఆ బాబులు మనసు పెద్దది చేసుకొని ఎల్లబోయే ముందు రెండో మూడో సేతిలో పెడతారు. ఈ నాల్రోజులు ఆబాబులిచ్చే డబ్బులే ఆధారం బోధపడిందా. ఎల్లు. బేగెల్లు" అంటూ తాళాల గుత్తి మనవడికిచ్చేడు.

కనకారావు లేచి నిలబడి, తననిక్కరు చొక్కా ఎలాగా వున్నాయో ఏదో చూసుకుని, చింపిరిగా వున్న తలని చేతితోనే ఓ మారు దువ్వుకున్నట్టు సర్దుకొని తాళాలు పుచ్చుకుని గడప దాటబోతుండగా పైడియ్య

మెల్లగా "ఒరే, ఆగరాగరా" అన్నాడు. కనకారావుకి చికాకు కలిగినా ఆగక తప్పింది కాదు. పైడియ్య మెల్లిగా లేచి ఆ గుడిసెలో ఓ మూల పెట్టెలోనించి దోసిట్లో పట్టేటంతటి మూట నొకదానిని తీసి, జాగ్రత్తగా పట్టుకుని మనవడి చేతి కిచ్చి "ఒరే, నాయనా, నేనో వుపాయం సెబుతాను, జాగర్తగా యిను. నీ తెలివి తేటలుపయోగించి నేన్చెప్పినట్టు సేసేవా, మనకా బాబులిచ్చే "బక్షీస్" డబ్బుల్తో పాటు మరో అయిదార్రూపాయలు ఎగస్ట్రా వొస్తాయి. అయ్యగారని సేతిలో కొస్తే సాలు, ఇలాటి నోవ బీతం [illegible] కరిసినా బాధలేదు. ఏటి బోద పడిందా?" అంటూ మెల్లిగా రహస్యం చెబుతున్నట్టు కనకారావు చెవిలో డబ్బులు సంపాదించే వుపాయం వుపదేశించాడు అంతా విన్నాక కనకారావు గమ్మత్తయిన నవ్వొకటి నవ్వాడు అందులో "ఓస్, యీ మాత్రం పని చెయ్యలేకపోతే నేన్సి మనవణ్ణే కాను" అన్న భావం పైడియ్యకు కనిపించడంతో "జాగర్త సుమా, యీ రాత్రంతా ఆ డబ్బుమీద దేలాపనతో (ధ్యాసతో) గడి పేస్తా. ఆ దొర లెల్లిపోయిన వెంటనే ఆ డబ్బులొట్టుకుని వొచ్చెయ్యాల తెల్సిందా" అంటున్న తాతవైపు చిరునవ్వుతో కూడిన చూపు చూసి 'తెల్సింది,' అంటూ కనకారావు బయటపడ్డాడు తాత ఇచ్చిన మూట పట్టుకుని.

కనకారావు బంగళా చేరుకుని, బంగళా తలుపులు తెరిచి లైటు వేసి, తను పట్టు కొచ్చిన మూటను మూడో కంటి వాడికి తెలియకుండా దాచేసి బంగళా వరండాలో కొచ్చి నిలబడేసరికి, పాల సముద్రంలో స్నానం చేసిన రాజహంసలా మెరుస్తున్న తెల్లని కారు బంగళా దగ్గరకొచ్చి ఆగింది. కార్లోంచి ఇద్దరు పులుల్లాంటి వ్యక్తులు, ఇద్దరు నక్కల్లాంటి వ్యక్తులు దిగేరు వారి వెంట మరో పాలరాతి బొమ్మకూడా దిగింది. ఆమె ఒంటిమీద పల్చగా తెల్లగా వున్న చీర వుంది. ఆమె నెత్తిమీద వున్న సిగ మకరం వేసుకున్న పాములా వుంది. వరండాలో వున్న లైటు క్రిందకు ఆమె రాగానే ఆమె అప్పుడే బంగారు కొలనులో స్నానం చేసివచ్చినట్టు శరీరమంతా (చీరతో కప్పబడని) బంగారంతో మెరిసింది. ఆమె ముఖం నిండా అందమే వుంది. ఆమె గుండెలనిండా యవ్వనమే వుంది. ఆమెను చూస్తూ అలానే వుండి పోయిన కనకారావు భుజంమీద మెల్లగా కొట్టి "ఒరేయ్ ఇలా గొచ్చి ఈ కారులో వున్న సంచీ పట్టా. జాగ్రత. మా ప్రాణాలన్నీ అందులోనే వున్నాయి," అంటూ లావుగా వున్న వ్యక్తి కనకారావును కారు దగ్గరికి పంపాడు. కనకారావు కార్లోని సంచిని జాగ్రత్తగా బంగళా లోకి చేర్చేడు కారులోంచి దిగిన పాలరాతి బొమ్మ సినీమాల్లో పతివ్రతల వేషాలు వేసే పార్వతేనని జ్ఞాపకానికొచ్చాక కనకారావు వింత ఆనందం అనుభవించాడు.

ఆమెను అలా చూస్తూనే వుండిపోవాలనుకున్నాడు కాని, తతిమ్మా వాళ్లు వుండ నివ్వలేదు.

“ఒరేయ్ బాయ్, నీ పేరేమిట్రా?” అన్నారొకరు

“కిష్టారావండి.”

“వెరీగుడ్, మైడియర్ గోల్డెన్‌రావ్, యిక్కడెక్కడైనా గోళీసోడాలు దొరుకుతాయిరా?”

“దొరుకుతాయండి. ఓ ఫర్లాంగు ఎత్తే తింటానికి మసాలా గారెలు కూడా దొరుకుతాయండి” హుషారుగా చెప్పాడు కనకారావు వాడి కళ్ళన్నీ, వాళ్ళమధ్య వున్న టీపాయ్ మీద వాళ్ళు పదిలంగా పేర్చుకుంటున్న బ్రాందీ సీసాల మీదనే వున్నాయి. ఆ సీసాల్లో పెద్దసీసా ఒకటీ లేదు. నలుగురైదుమంది వున్నప్పుడు పార్టీకి పెద్దసీసాలు తెచ్చుకోవడమే వాడు చూశాడు. కానీ, వీళ్ళుమాత్రం ఎనిమిదో, పదో చిన్నవి (క్వార్టర్ సైజు) తెచ్చుకున్నారు. కారణం వాడికి తెలియదు. జాగ్రత్తగా లెక్కెట్టాడు వాటిని.

అవి పది సీసాలు.

కనకారావు నోటంట మసాలాగారెలు మాట వినగానే నల్లతెనపరాయిలా వున్న వ్యక్తి “ఏట్రా తమ్ముడూ, మందుకొట్టేటప్పుడు మసాలాగారెలుంటే మజాగుంటదని నీక్కూడా తెల్సినట్టుంది, అవున్లే ప్రతిరోజూ మాలాంటివాళ్ళనెంతమందిని చూస్తుంటావో! సర్లేగాని— ఈ రూపాయిన్నర పట్టుకెళ్ళి ఓ డజను గోళీసోడాలు, మిగిలిన చిల్లర డబ్బుల్తో వేడివేడిమసాలా గారెలు పట్రా” అంటూ జేబులోంచి రూపాయిన్నర తీసి యిచ్చాడు.

డబ్బులు తీసుకుంటూ కనకారావు మళ్లీ చూశాడు సీసాలవైపు. పది చిన్న సీసాలు అప్పుడే పుట్టిన పిల్లల్లా కనిపిస్తే, వాటి ప్రక్కన పెట్టబడ్డ పెద్దసైజు బీరు సీసాలు రెండూ, రెండు తల్లికోళ్ళలా కనిపించాయి.

“వీడు సోడాలు తెచ్చేలోగా మనం బీర్ మిక్స్‌చేసుకుని ఓ రౌండ్ లాగిద్దాం ఏమంటావ్ పార్వతీ.” అన్నాడు బక్కపల్చని వ్యక్తి.

“అలాగే కానిద్దాం. మీరు వుత్త ‘రా’ (Raw) కొట్టెయ్యమన్నా మేం సిద్ధంగా వున్నాం. పైన చలిమాస్తే ఎముకలు కొరికేస్తుంది. అవుట్‌డోర్ లొకేషనింకా ముప్పయి మైళ్ళుంది. తెల్లవారడానికింకా పన్నెండు గంటలుంది. అంతవరకు మనం క్షేమంగా వుండాలంటే యీ మందే శరణం గచ్ఛామి” అంటూ పార్వతి గుచ్చుకుంటే ఆమె పొందు తప్ప మరో గత్యంతరం లేనటువంటి నవ్వొకటి నవ్వింది. ఆమె నవ్వుతో అంతా ‘కోరస్’ కలిపారు. కనకారావు జేబులో డబ్బులు వేసుకుని చీకట్లో కలిసిపోయాడు.

ఓ అరగంట తర్వాత నెత్తిన సోడా కేసుతో, చేతిలో మసాలా గారెల పొట్లంతో కనకరావు వచ్చేసరికి అక్కడున్న వాళ్లు

మొదటి రౌండు దిగ్విజయంగా ముగించి రెండో రౌండుకి సిద్ధమవుతున్నారు వాళ్లు మాట్లాడుకుంటున్న మాటలన్నీ సినిమాల గురించే. 'సినిమాల్లో ముద్దులు వుండక తప్పదు' అంటున్నాడు డైరక్టరుగా పిలవబడుతున్న వ్యక్తి. కనకారావు సీసాలు లెక్కపెట్టాడు. కొన్ని ఖాళీ అయ్యాయి. నిండుసీసాలదగ్గర ఖాళీసీసాలు ధనవంతుకి ముందు పేదవాడిలా వెలవెలబోతున్నాయి. కనకారావు కళ్ళలో పైట జారిన పాలరాతి బొమ్మ పరువాలు గుచ్చుకోవడంలేదు. వాడి కళ్ళనిండా పైడియ్యరాక దగ్గుతూ కూర్చున్న రూపమూ, మెదడునిండా ఇందాక తాత చెప్పిన మాటలు చేస్తున్న యుద్ధముంది.

ఇంతకీ తాత చెప్పినదేమిటి?

"...దొరబాబులు బాగా తాగి ఒళ్ళు తెలీకుండా పడి నిద్రపోయినప్పుడు మెల్లిగా వెళ్ళి, నువ్వు తెచ్చిన సోడాబుడ్లలో రెండింటిని తీసి వాళ్లకు కనపడకుండా దాచెయ్. ఆ గదిలో. ఇంగో నేనిచ్చే మూటలో వున్న గాజు పెంకుల్ని అక్కడక్కడ జల్లెయ్ పొద్దున్లేచి, ఆ దొరబాబులెళ్ళిపోయాకైంలో "అయ్యో రాత్రి ఎవరి


HEARTY DASARA GREETINGS TO ALLOUR CUSTOMERS

New NUETEX

1st Anniver-sary

Chinnamma Buildings GUNTUR-3

In just less than 12 months this new Show Room has become the talk of the town

exlusively for

BOMBAY DYEING & GWALIOR fabrics

కాలు తగిలి రెండు సీసాలు పగిలిపోయేయి. ఇదిగో ఆ సీసాలగాజు పెంకులు గూడా ఇంకా యిక్కడే వున్నాయి. ఆమరిక చూపించే చీపురుతో తుడిచ్చామనుంటాను ... ఆ సీసాల ఖరీదు అయిదు రూపాయిలు ఆ కొట్టు వాడికివ్వాలి' అని చెప్పమన్నాడు.

చెప్తే ఏమవుతుంది?

వాళ్ళు అయిదు రూపాయిలు యిస్తారు.

అవును ఇస్తారు,

అంతేకాక, మామూలుగా యిచ్చే బక్షీస్ డబ్బులు రెండో మూడో రూపాయిలిస్తారు,—అవును ఇస్తారు.

అప్పుడు తను ఆడిన అబద్ధానికి అయిదు రూపాయలు, ప్లస్ చేసిన సేవకు బక్షీస్ కలిపి ఏడు రూపాయలు-వస్తాయి.

ఏడు రూపాయలతో ఏడు రోజుల పాటు ఏబెంగా లేకుండా, హాయిగా గడిపెయ్యొచ్చును.

కాని మరోలా చేస్తే?

తాత చెప్పిన ఆలోచన తాతలాగే ముసలి ఆలోచన. సీసాలు పగిలిపోయేయని అబద్దం ఆడ్డంకంటే, వాళ్ళు బాగా తాగి తాగి, తెలివిలేని స్థితిలో వున్నప్పుడు, వాళ్ళు తాగకుండా వుంచేసిన సీసాల్లో ఒకటి తీసి దాచేస్తే బ్రహ్మాండంగా వుంటుంది. తర్వాతెప్పుడైనా బంగళాకొచ్చినవాళ్ళకు ఆ సీసా అమ్మెయ్యొచ్చు వర్షంరోజుల్లో షాపువారు తమ కొట్లోన్ని సరుకుల్ని హెచ్చుధరలకి అమ్మినట్లు, మందు దొరకని సమయంలోనో, తెచ్చిన సరుకు అయిపోయి ఆవురావురుమంటున్నప్పుడో, ఈ సీసాని ఎక్కువ ధరకు అమ్మజూపచ్చు. పదిరావచ్చు, పదిహేను రావచ్చు. చెప్పలేం! ప్రైమునిబట్టి ఎంతయినా రావచ్చు కానీ, వాళ్ళు ఆసీసాలన్నీ ఖాళీచెయ్యకుండా వుండాలికదా! వాళ్ళంతా తప్పతాగి పడిపోవాలికదా!

'దేవుడా దేవుడా, వాళ్ళు కొన్ని సీసాలు మాత్రమే తాగాలి తాగాలి. ఒకటి రెండు సీసాలు వొదిలెయ్యాలి వొదిలెయ్యాలి....వాళ్ళు తాగితాగి తప్ప తాగి తాగుబోతు ఎదవల్లాగ పడిపోవాల పడిపోవాల..."

కనకారావు వాళ్ళవయిపు చూసాడు.

వాళ్ళు అయిదుగురు సరదాసరదాగా తాగుతున్నారు. సరదాసరదాగా మాట్లాడుకుంటున్నారు. ఇంకా సరదాసరదాగా హాస్యాలాడుకుంటున్నారు. గంట గడిచింది రెండు గంటలు పూర్తయ్యాయి మూడో గంట కావొచ్చింది.

మూడు గంటలు —ఆరు సీసాలుగా ఆనందిస్తున్నారు వారు ఎందుకో అప్పుడప్పుడు పార్వతితో ఒక్కొక్కరే పక్క గదికి వెళ్తున్నారు వస్తున్నారు— నవ్వుకుంటున్నారు. కనకారావు అదేం పట్టించుకోలేదు గాని, మరో అరగంట తర్వాత నలుగురు మగవాళ్ళు తప్పతాగి తెలివిలేకుండా పడిపోయినప్పటికీ, పార్వతి యింకా తాగుతూనే వుండటం కనకా




రావుకి చెడ్డ చిరాకు కలిగింది. కానీ, మరో పది నిమిషాలలో ఆమెకూడా పక్కకి వాలిపోవడంతో, తన నెత్తిమీద బరువును ఎవరో చేత్తో తీసేసినట్టు ఒక్క నిమిషం హాయిగా వూపిరి పీల్చుకున్నాడు. తర్వాత ఓ సారి బయటికి చూసాడు. చిక్కని చీకటి తప్ప చిటికెడు వెలుతురు లేదు, గదంతా కలియజూసాడు పచ్చని వెలుతురు తప్ప పట్టెడు చీకటిలేదు. మెల్లిగా మెల్లిగా సీసాల దగ్గరకివెళ్లి, మెల్లిగా ఓ పెంకు సీసాను తీసి టపీమని బొడ్లో దాచేసాడు.

* * *

రాత్రంతా దగ్గుతో యుద్ధం చేసి జ్వరానికి 'సరండర్' అయిపోయి పైడియ్య కేంద్రించి వుమ్మి, గుడిసెలోనించేబంగళా వయిపు చూసాడు. ఆ క్షణంలో అది అందంగా కనిపించలేదు. టైమెంతయి వుంటుందోనని చుట్టూ వున్న చీకటివైపు చూసాడు చీకటి ముక్కలు ముక్కలుగా విడిపోతోంది. చల్లటి వెలుతురు ప్రపంచం మీదికి మెల్లిగా పరుచుకొంటోంది. తూర్పు ఆకాశంలో తెల్ల కలువ పువ్వు మెల్లి మెల్లిగా రేకులు విప్పుకుంటోంది.

'కడుపులోని పేగులు కాపీ నీళ్ల కోసం కేకలేస్తున్నాయి. దొరబాబులింకా లెగనేదో ఏవో, ఇంకా ఈ గుండు అంపునేడు'' బయటికే మూలుక్కున్నాడు మరో అయిదు నిమిషాల తర్వాత విచ్చుకుంటున్న వెలుగు రేకుల మధ్య నించి గుడిసెవయిపు నడుచుకొస్తున్న కనకారావు కనిపించాడు. "అమ్మయ్య వచ్చేస్తున్నాడు' అనుకుంటూ ఒంటినిండా

దుప్పటి కప్పుకుని గుడిసె బయటి కొచ్చాడు కనకారావు చేతిలో మూట భద్రంగా వుంది.

"ఏట్రా ఏటయింది, నేన్చెప్పినట్టు చేసేవా? ఇచ్చేరా డబ్బులు?" ఆత్రంగా అడిగాడు.

కనకారావు ముఖం అగ్గిలో కాలిన బంగారంలా మెరవలేదు. 'ఇవ్వనేదు' అన్నాడు ముక్తసరిగా, పైడియ్య కనకారావుని పరిశీలించి చూసాడు ఎర్రగా వున్న మవపడి బుగ్గలమీద స్పష్టంగా కన్పించాయి అరచేతివేళ్ళ గుర్తులు

'ఎన్రా ఏటయింది? అళ్ళు కొట్టేరా నిన్ను? ఎందుక్కొట్టేరు? అళ్ళు రాత్రంతా మందు కాయలుకొట్టి, పొద్దున్లేసి నిన్ను లెంపకాయలు కొట్టేరా? ఏటయిందో సెప్పరా సెప్పు?" దబాయించి అడిగాడు పైడియ్య కనకారావుకి చెప్పక తప్పింది కాదు.

'నువ్వు చెప్పిన అవిడియా కంటే మంచి అవిడియా నాకోటి తట్టింది. అళ్ళు తాగగా మిగిలిన రెండు బుడ్లలో ఒకటి తీసి దాచీస్తే తర్వాత దాన్ని అమ్ముకోవచ్చు గదా, పంపు పట్టులో అళ్ళకది యాదస్తుండదు కదాని ఒక బుడ్డి తీసి దాచబోతుండగా వందులో బడ్డుగాడొకడు అప్పాపి

పైడియ్యకి వొళ్ళు మండిపోయింది.

"పట్టుకొని తన్నేరు, అంతేనా? నీకు నేన్చెప్పిందేటి, నువ్వు చేసిందేట్రా లంజకొడకా? దొంగతనం చేస్తుండగా దొరికిపోతే సాచి తన్నడం మానేసి పిల్చి ముద్దెట్టుకుంటార్రా.... అయినా ఏదో చిన్న అబద్ధం ఆడి డబ్బొస్తోంపాయింటరా అని పంపిస్తే, ఏకంగా దొంగతనంచేసేద్దావని అవిడియా ఏసినావు మరాళ్ళ దక్కానికి సేబని వూరికే అంటార్రా.... అయినా ఇలాంటి పన్లకి నీలాంటిగుంటనా కొడుకుల్ని బెత్తాయించడం నాదే బుద్ధి తక్కువలే. సర్సరేగాని, అళ్ళిచ్చిన బక్షీస్ డబ్బులైనా ఇలా తగలెయ్యి. బేగెల్లి మందు ఏసుకోకపోతే యీ జొరం వొదిలేటట్టు లేదు. ఆ డబ్బులిలెయ్యి" అంటూ చెయ్యి చాపాడు కోపంగా బాధగా, అసహ్యంగా, అసహనంగా.

కనకారావు ముఖాన్ని కిందికి దించుకుని "ఆ బాబులికి నా మీది కోపం వచ్చింది గావాల బక్షీస్ డబ్బులియ్యకుండానే కారెక్కి ఎల్లిపోయాడు. అకాడికి అళ్ళు కారెక్కముందు అడిగాను కూడాను. గవర్మెంటు బంగాళాలకి నీలాంటి దొంగనాకొడుకుల్ని కాపలా పెట్టుకోవడమే బుద్ధి తక్కువ ఇకా నీకు బక్షీసొకటా, వుండుండు గవర్మెంటుకి నీ తాతమీద రిపోర్టిస్తా...." అంటూ చెప్తున్న కనకారావు చెంప ఛెళ్ళుమంది, ఆ దెబ్బకి కనకారావు చేతిలోని మూట ఎగిరి కిందపడిపోయింది

ఇద్దరూ ఒకేసారి పడిపోయిన మూట వైపు చూసారు ఈ ప్రపంచానికి దేవుడు పెట్టిన దీపం వెలుతురులో ఆ మూట విడిపోయి బయటపడిన పగిలిన పెంకులు వాళ్ళిద్దరినీ చూసి పకపకమన్నాయి ఒక్కసారి.